# భావ స్థిరాణి....!

-బి.రాంబాబు

నేనే ముందుగా తనను చూశానో లేక తానే ముందుగా నన్ను చూసిందో తెలియదు గాని మా రెండు కళ్ళు ఒక్కసారిగా కలుసుకున్నాయి. ఎక్కడో చూసినట్లుంది. బాగా పరిచయం ఉన్న వ్యక్తిలా అనిపిస్తుంది. కానీ ఎక్కడ చూశానో స్ఫురించడం లేదు. నాకలం కదులుతుంది గానీ మనసు మాత్రం అదే ఆలోచిస్తుంది. ఎంత ఆలోచించినా గుర్తుకురావడం లేదు. మనసు మరలా అటువైపే చూడమని కళ్లను ఆజ్ఞాపిస్తుంది.

సభ్యత కాదేమోనని సంశయం. చివరకు మనసు మాట విన్నాయి కళ్ళు. నేను తలెత్తి చూశాను. తను కూడా నావైపే చూస్తోంది. మరలా మా కళ్ళు కలుసుకున్నాయి.

ఆమె కళ్ళు చిరునవ్వులు చిందిస్తూ అల్లరిగా పలకరిస్తున్నట్లు అనిపించింది. తలవంచి నా పనిలోకి దిగాను. పనిసాగడంలేదు. ఆలోచనలు ఆమె వైపు.

"హలో!మీ పని ఎంతవరకూ వచ్చింది?" అంటూ పలకరించారు ధర్మారావుగారు తన తెల్లటి గడ్డాన్ని సవరించుకుంటూ.

భారతదేశం గర్వించగదిన చిత్రకారుడాయన.

"బాగానే నడుస్తుంది సార్" అన్నాను లేచి నిలబడి.

వారేదో చెప్తున్నారు. నేను వారియందున్న అత్యధిక గౌరవభావంతో చెవులప్పగించి వింటున్నానే గానీ కళ్ళు అటువైపే ఉన్నాయి. నాలుగు నిముషాలు గడిచాయి. ఆమె లేచి మా వైపే అడుగులు వేస్తున్నారు. నా పరిచయం కోసమే అన్నట్లుగా నా సిక్త్‌సెన్స్ చెప్తుంది. వచ్చిన వెంటనే వీరు అంటూ ధర్మారావుగారిని పరిచయం చేయమన్నట్లుగా అడిగారు. ఇడు "మిస్టర్ రామచంద్ర కాశ్యప" అని పరిచయం చేస్తూ ఇంకేదే చెప్పబోతుండగా వెంటనే అందుకుని

"కొత్త గోదావరి సృష్టికర్తకదూ!" అన్నారామె అందుకుంటూ ఆనందంతో తన నీలికళ్ళను టపటపలాడిస్తూ.

"మీ కవిత్వం చాలా అద్భుతంగా ఉంటుందండీ" అంటూనే కరచాలనం చేశారు మెచ్చుకోలుగా.

అటువంటి అభినందనలు నా జీవితంలో ఎన్నో అందుకున్నాను. కానీ ఈమె హస్తస్పర్శ నన్ను ఆనందపరవశుణ్ణి చేసింది. బాగా పరిచయం ఉన్న వ్యక్తి అనిపిస్తుంది. ఎక్కడ చూశానో గుర్తుకు మాత్రం రావడం లేదు. అడుగుదామా వద్దా అని తటపటాయిస్తున్నాను.

ఇప్పుడే వస్తానంటూ ధర్మారావుగారు ముందుకు నడిచారు.

ఆమె అభిమానంగా నా భుజంపై చేయి వేసి "మీ పరిచయభాగ్యం నా జీవితంలో ఒక మంచి సంఘటనగా భావిస్తున్నాను. మన పరిచయం ఒక స్రవంతిలా సాగాలని మనసారా కోరుకుంటున్నాను" చొరవగా అన్నారామె.

ఒక్క క్షణం గడిచింది. "మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందే!" ఏదైతే ఏమైందిలే అని ధైర్యంగా అడిగాను. ఆమె చొరవ నాలో ధైర్యాన్ని నింపింది.

"నేనూ అదే అనుకుంటున్నాను సుమండీ! ఎంత ఆలోచించినా గుర్తుకురావడం లేదు. ఎక్కడో చూసినట్లు, మీతో బాగా పరిచయం ఉన్నట్లు అనిపిస్తుంది. ఎంతకీ గుర్తుకురావడం లేదు. అందుకే మిమ్మల్ని అడగాలని వచ్చాను" అంటూ గలగల మాట్లాడుతున్నారామె.

అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. మేమిద్దరం మాలోకంలో పడి మేం మాట్లాడుకుంటున్నాం. ఐదు నిమిషాలు సాగింది వాక్ప్రవాహం. మా మాటలు నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నట్లు అనిపించింది. దాన్ని గమనించిన ఆమె మాటలు ఆపారు. ఒక్క క్షణం గడిచాక లేచి వెళ్లడానికి ఉద్యుక్తులైనారు.

"కాఫీ తీసుకుందురుగాని ఒక్క నిముషం ఆగండీ" అన్నాను మర్యాదపూర్వకంగా.

"వద్దండీ! సాయంత్రం ఐదుగంటలకు గోదావరి ఒడ్డుకు వెళదాం" అన్నారు లేచి వెడుతూ ఆపైన మా స్నేహానికి ప్రారంభాన్ని సూచిస్తూ.

★ ★ ★

ఆకాశమనే పెద్ద ముత్తైదువ నుదుటనున్న కుంకుమబొట్టులా మెరుస్తున్నాడు సూర్యుడు.

గోదావరి నీళ్లల్లో కాషాయరంగు ప్రతిఫలిస్తూ వింత అందాన్నిస్తోంది. గాలి, గోదావరిని స్పృశించ చల్లదనాన్ని మోస్తూ హాయినిస్తోంది. గోదావరి ఒడ్డున ఇసుకలో నా ఎదురుగ్గా కూర్చున్న వరలక్ష్మిగారు నా అనురాగశ్రీ కవితలను భావయుక్తంగా, రాగయుక్తంగా చదువుతున్నారు.

లేతపచ్చరంగు మీద అక్కడక్కడా గులాబీ చుక్కలున్న బెంగాలీ కాటన్ చీర ధరించారు. ఆమె చామనఛాయకు నప్పిన ఆ చీరపై అదే రంగు జాకెట్. నుదుటనున్న పెద్ద కుంకుమబొట్టు వయస్సుకు నిండుదనాన్నిస్తోంది. తాను ధరించిన కళ్లద్దాలు పెద్దతనాన్ని, హుందాతనాన్ని తెచ్చిపెడుతున్నాయి. ముచ్చటగా ఒదిగి కూర్చుని ఆమె చదువుతుంటే ఒక విధమైన గౌరవభావం కలుగుతుంది. నేను ఆమెనే తదేకంగా చూస్తున్నాను.

ఆమెను ఎందుకో చూడాలనిపిస్తుంది. మధ్యలో ఆపి నేను వింటున్నానో లేదోనని నావైపు హఠాత్తుగా చూశారు.

నేను వినడం లేదని గమనించారామె. తీక్షణంగా నావైపు చూశారు.

"మీరు నేను చదివే కవితలు వినడం లేదు" అన్నారు. ముద్దుగా విసుక్కుంటూ చిన్నపిల్లలా అల్లరిచూపులు చిందించారు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందండీ. ఏదో అభిమానం హృదయంలో నుండి పొంగుతుంది" అన్నాను భావుకతతో.

"అబ్బ! పోనీయండి. ఈ మాట ఇప్పటికి పది సార్లు అన్నారు" అందామె కొట్టిపారేస్తూ.

"ఇక్కడ పరిచయమైంది. ఇక్కడే చూశారు. ఇది ఒక అనుభూతి. మన స్నేహం కలకాలం సాగాలి" అన్నారు దృఢంగా, అభిమానం మేళవించి. ఆమె అన్నమాట నిజం.

పరిచయమైననాటినుంచి ఇప్పటివరకూ ఈ పదిరోజుల్లో ఇద్దరం కలిసి ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. ప్రాణస్నేహితుల్లా అరమరికలు లేకుండా మెలిగాం. హోటళ్ళూ, బస్టాండ్ అన్నీ మావే.

గోదావరి ఒడ్డున ఇసుకతిన్నెల మీద ప్రతి సాయంత్రం కబుర్లతో, పాటలతో, పద్యాలతో గడిపాం. ఇద్దరు మగ, లేక ఆడ స్నేహితులు ఎలా కలిసి ఉంటారో అలాగే చిన్న పిల్లల్లా గడిపాం. మా ఈ స్నేహంలో అపార్థానికి గాని, అసభ్యానికి గానీ

తావులేనేలేదు. అరమరికలు, అంతరాలు అంతకన్నా లేవు. పరిచయమైన సాయంత్రం నుంచి మేం మా అంతరాలను, అంతస్తులనూ వదిలివేశాం. పసిపిల్లల్లా గోదావరి కెరటాల అందాన్ని ఆస్వాదిస్తూ గుజ్జనగూళ్ళు కట్టుకుంటూ కబుర్లు చెప్పుకున్నాం.

నాకు శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలూ అంటే ప్రాణం. తనకు తెనాలి రామకృష్ణుడూ, భట్టుమూర్తి అంటే ఇష్టం. ఆలోచనలు, అనుభూతులు పంచుకోవడంతోనే ఈ పదిరోజులు పదిక్షణాల్లా గడిచిపోయాయి. మా జీవితాల్లోని ప్రతి సంఘటనలనూ వదిలిపెట్టకుండా ఈ గోదావరి ఒడ్డున ఇసుకతిన్నెలపై వెన్నెల్లో చెప్పుకున్నాం.

అనుభూతులతో కూడిన ఆలోచనలు నన్ను వివశుణ్ణి చేస్తున్నాయి. నేను నాలోకంలో ఉన్నాను.

"హలో! చెప్పడం మరిచాను. సాయంత్రం గోదావరిలో శ్రీవారు దిగుతారు. వెళ్లి రిసీవ్ చేసుకోవాలి. భోజనం చేసి రెడీగా ఉండండి" అన్నారు నా ఆలోచనలు భగ్నం చేస్తూ.

"జీ! హుకుం" అన్నాను సినీఫక్కీలో.

"అదిగో అలా ఉడికించవద్దు" అన్నారు చిన్నపిల్లలా మూతిముడుస్తూ ఎప్పటిలాగే.

★ ★ ★

ఠంచనుగా గోదావరి ఎక్స్‌ప్రెస్ తొమ్మిదిగంటలకు మిలటరీ సైనికుడిలా వచ్చి ఆగింది.

అందులో నుండి దిగారు మిస్టర్ రావుగారు. ఎత్తైన విగ్రహం, దానికి తగ్గ లావు, బుర్రమీసాలు, పసిమిఛాయ. సుమారు యాభైఏళ్ళు వయస్సున్నా సుశిక్షితుడైన సైనికుడిలా 35 ఏళ్ళ వ్యక్తిలా హుషారుగా ఉన్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే 'పుంసాం మోహన రూపాయ' అనవచ్చు. చిరునవ్వులు చిందిస్తూ నమస్కరించాను. ప్రతి నమస్కారం చేసి వెంటనే ఆమె వైపు తిరిగి-

"ఏమోయ్! గోదావరి నీళ్ళు బాగా వంటబట్టాయే" అంటూ వీపున చనువుగా సుతిమెత్తగా చరిచి ఆ వెంటనే నావైపు తిరిగి "మీరు రామచంద్ర కాశ్యప" అన్నారు కరచాలనం చేస్తూ.

"మీగురించి మా వరం రాసింది. తనకు ఒక మంచి నేస్తం లభించినందుకు ఐయామ్ వెరీ వెరీ హ్యాపీ"అన్నారు అభినందన పూర్వకంగా చేయి నొక్కుతూ.

లగేజీ తీసుకుని స్టేషన్ బయటకు వస్తున్నాం.

రావుగారి ప్రక్కనే నడుస్తున్న వరలక్ష్మిగారిని చూశాను. ఆమె కూడా ఎత్తరి మనిషే. కాకుంటే రావుగారి ప్రక్క చిన్నగా అనిపిస్తున్నారు. వారి భుజాల వరకే వచ్చారు.

కావాలనే నేను వారిని గమనిస్తూ వెనుకే నడుస్తున్నాను. స్టేషన్ బయటికి వచ్చేవరకూ రావుగారి వాక్ప్రవాహం సాగుతూనే ఉంది. వరలక్ష్మిగారు వారి మాటలు వింటూనే వారి వైపు ఆరాధనగా చూస్తూ మధ్యమధ్యలో చిరునవ్వులు చిందిస్తూ హుషారుగా నడుస్తూనే ఉన్నారు. వారిద్దరినీ చూస్తుంటే ముచ్చటేస్తుంది. మంచి జంట అనిపించింది. ఆటోలో సామాను వేసుకుని కదిలాం.

★ ★ ★

హోటల్ అజంతాలో నేను, మిస్టర్ రావుగారు కిటికీ దగ్గరగా కుర్చీలు వేసుకున్నాం.

"మీ తూర్పుగోదావరి జిల్లా వారు మర్యాదకు మారుపేరు సుమండీ. మాటలు దీర్ఘం తీస్తూ వినసొంపుగా పలుకుతారు. అసలు మీ గోదావరి నీళ్ళు త్రాగితే కళలు కవిత్వం అబ్బుతాయంటారు మా ఫాదర్. అందుకే నేను ఈ నీళ్ళు తాగకుండా మద్రాస్ పారిపోయాను" అని తనపై తానే జోక్ చేసుకుంటూ ఫెళ్ళున నవ్వారు రావుగారు.

సర్వర్ టీ తెచ్చాడు. టీతోపాటే ఆయన పిఏ ముఖ్యమైన ఫైల్స్ తెచ్చి ముందుంచాడు.

"మిస్టర్ రామచంద్రా! ఒక్క పదినిముషాలు నన్ను వదలగలరా? మీరు అనుమతిస్తేనే సుమండీ" అంటూ టీ కప్పు వదిలి ఫైల్స్‌లో తల దూర్చారాయన.

టీ కప్పు సర్వర్ చేతికిచ్చి ఒక్క రెండునిముషాల పాటు అక్కడున్న వీక్లీలోకి చూశాను. ఆ తరువాత తలపైకెత్తి కిటికీలో నుంచి బైటకు చూశాను.

దూరంగా నిండుచూలాల్లా గోదావరి ప్రవహిస్తోంది. సాయం సమయం నీరెండలో గోదావరి తళతళలాడుతూ మెరుస్తోంది. గోదావరి నీళ్లల్లో కవిత్వం ఉందనే రావుగారి మాటలు నిజం భావుకతను నింపి గోదావరి కవిని చేస్తుంది. కళాకారుడిని చేస్తుంది. అందుకే ఈ నేల ఎందరో కవులకు, కళాకారులకు నిలయం. నా బాల్యాన్ని, యవ్వనాన్ని గోదావరి ఒడ్డునే గడిపాను. నా జీవితంలోని ప్రతి సంఘటనకూ ఈ గోదావరే సాక్షి.



ఈ గోదావరి ఒక్కొక్క సమయంలో నాకు ఒక్కొక్క రకంగా కనిపిస్తుంది. నా భావాలకు ప్రతిరూపం క్రొత్త గోదావరి కావ్యం. ఎన్నో కవితా సంకలనాలు వెలువరించాను గానీ నాకు ఆ కావ్యమే అనంతమైన ఖ్యాతిని తెచ్చిపెట్టింది. గోదావరిని గమనిస్తున్న నా కళ్ళు ఆలోచనా సులోచనాలు ధరించాయి. నా మనస్సులో ఎన్నో భావాలు గోదావరి నీళ్లల్లా కదులుతున్నాయి.

* * *

పావుగంట గడిచింది. "హమ్మయ్య" అంటూ ఒక్కసారిగా ఒళ్ళు విరిచి ఆపైన రిలాక్స్ అయ్యారు రావుగారు. ఆ సవ్వడి నా ఆలోచనలను భగ్నం చేసింది. ఊహలనుంచి ఒక్కసారి బైటకు వచ్చారు.

"ఇదండీ మా జీవితం. ఏడుగంటలకల్లా ఈఫైల్స్‌ను మనిషితో పంపాలి. కాస్తంత ఆలస్యం అయితే నష్టం వేలల్లో ఉంటుంది. ఆ జీవితం యాంత్రికం సుమండీ!" అన్నారు సిగార్ వెలిగించుకుంటూ.



## నిజమైన పున్నమి?

ప్రభుదేవా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పౌర్ణమి చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంది. ఇప్పటికే ఈచిత్రం ఆడియో విడుదలైంది. త్రిష, ఛార్మి హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈచిత్రంకి సంబంధించిన అరకువ్యాలీలో పాటల చిత్రీకరణ జరిగింది. క్లైమాక్స్ కూడా పూర్తయిందని ఈచిత్రాన్ని ఈఏప్రిల్ 20న విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎం.ఎస్.రాజా చెబుతున్నారు. ఇరువురు భామలు చేసే అందాలవిందు ఈ పౌర్ణమిని ఏమేరకు సక్సెస్ చేస్తుందో చూడాలి మరి!




"పున్నమి వెన్నెలలు, ప్రవాహపు గలగలలు, మువ్వల ఘలఘలలు వంటి పదాలు మాకు దూరం. ఆలోకమే వేరు. మా జీవితం చాలా యాంత్రికం.

అందులోనూ ఈ బిజినెస్ మరీనూ" అంటూ తన వ్యాపారం గురించి ఒక పదినిముషాలు వివరించారు. ఆయన మాటలు వింటుంటే ఆయన ఒక బిజినెస్ మాగ్నెట్ అనిపించింది. జీవితాన్ని సాధించారాయన. ఆయన అనుభవాల పుట్ట. జీవితాన్ని ఎక్కడ ఈజీగా తీసుకోవాలో, ఎక్కడ సీరియస్‌గా తీసుకోవాలో తెలుసువారికి.

"ఎంత వ్యాపారమైనా మానవత్వాన్ని మాత్రం వదలలేదు కాశ్యపా!" అంటూనే "మా బాబుది పూర్తిగా నా పర్సనాలిటీయే. కానీ లక్షణాలన్నీ వాళ్ల మ్మవి కాశ్యపా!" అన్నారాయన నా వైపు చూస్తూ రెండుచేతుల్ని తలవెనుకకానిస్తూ.

"వాడికి సాహిత్యం, సంగీతం రెండుకళ్ళు. కాస్తంత అవకాశం చిక్కితే చాలు ఏదో ఒక సమావేశం నడుపుతుంటాడు" కొడుకుని గురించి చెపుతుంటే ఆయన కళ్లల్లో ఆనందంతో కూడిన మెరుపు.

"ఐయాం వెరీ వెరీ ప్రౌడాఫ్ మై సన్" అన్నారాయన గర్వంగా.

వాళ్లకు ఒక్కడే కొడుకు. అమెరికాలో డాక్టర్. అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుందని రావుగారిని చూస్తే నాకన్పించింది.

నిరాడంబరత ఆయన మాటల్లో కనిపిస్తోంది. వరలక్ష్మిగారిని ఆయన ఏరి కోరి చేసుకున్నారు. మొదటిసారిగా చూసినప్పుడు ఏ భావన ఉందో ఇప్పటికీ ఆ భావన రెట్టింపైంది గానీ ఇసుమంతైనా తగ్గలేదని ఆయన ఎన్నోసార్లు చెప్పారు. వరలక్ష్మిగారు నాతో రావుగారి గురించి చెప్పినమాటలు వారిని చూస్తే నిజం అనిపిస్తుంది.

ఆమె ఉద్యోగం చేస్తానని ఒక్కమాట అనగానే "ఓయస్" అన్నారాయన.

జీతం మొత్తం విద్యార్థులకు ఇస్తానంటే "సరే" అన్నారు. కష్టపడి చదివేవారికి చేయూతనిచ్చి పైకి తీసుకురావాలని, వాళ్ళ అభివృద్ధికోసం చేతనైనంతగా పాటుపడాలనే ఆలోచన వాళ్లకుండటం నిజంగా మెచ్చదగిన అంశం.

"ఏమిటిసార్! చాలా దీర్ఘాలోచనలో మునిగారు" అన్న వారి మాటలకు తలెత్తాను. "మిమ్మల్ని చూస్తే నాకెందుకో చాలా ఇష్టంగా ఉంది రామచంద్రా! వరలక్ష్మి చాలా మితభాషి. కాలేజీలో కూడా ఎవ్వరైనా కబుర్లు చెప్తే వినడమే కానీ తనకి తానుగా మాట్లాడదు. అటువంటి వ్యక్తి మీ గురించి ఎంతో రాసింది. కావాలంటే చూడండి" అంటూ ఉత్తరం తీసి చూపించారు.

నేను విస్మయంగా చూస్తున్నాను.

"ఇతరుల ఉత్తరాలను అందులోనూ భార్యభర్తల ఉత్తరాలను చదువకూడదనే ఆలోచిస్తున్నాను" అంటూ అది తీసుకోవడానికి సంశయించాను.

"ఫర్వాలేదు అందులో సంబోధన మాత్రం నాకే. క్షేమసమాచారాల తర్వాత ఉత్తరం అంతా మీ గురించే"పరాయి వ్యక్తిని గురించి భార్య ఉత్తరం రాస్తే ఈర్ష్య పడడం మామూలు మానవస్వభావం కదా! రావుగారిలాంటి విశాలహృదయం గల వ్యక్తులు ఈరోజుల్లో చాలా అరుదు. నామనసులో ఆయనకు, ఆయన సంస్కారానికి జోహార్లు అర్పించుకున్నాను.

అంతటి విశాలహృదయుడు కాబట్టే ఆమె ధైర్యంగా ఇన్ని విషయాలు రాయగలిగింది.

"హలో రామచంద్రా! ఆలోచనలు వదిలి ఉత్తరం చదవడం పూర్తిచేయండి మహానుభావా!" నవ్వుతున్న రావుగారి మాటలకు ఈలోకంలోకి వచ్చాను. వరలక్ష్మిగారు మా ఇద్దరి స్నేహం గురించి ప్రత్యక్షరంలోనూ వివరించారు.

"మిస్టర్ కాశ్యపా! ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. మంచితనం, మానవత్వంతో కూడిన స్నేహస్పర్శ మాత్రమే. ధనం అనే మృగాన్ని మనం మైదానంలో స్వేచ్ఛగా తిరుగనిస్తున్నాం. అది అనుబంధాలను తినివేస్తుంది అనే ఆవేదన నన్ను బాధిస్తుంటుంది. దీనికి మాత్రం మనం లొంగకూడదు"

మర్యాదపూర్వకంగా, సాదరంగానూ అన్నారాయన. ఒక గొప్ప వేదాంతిని, వ్యాపారవేత్తను, మంచి భర్తను, స్త్రీ హృదయాంతారలలోని భావాలను అర్థం చేసుకున్న మహోన్నతవ్యక్తిని చూసినట్లు అనిపించి మనసులోనే నమస్కరించాను. ఆలిండియా కల్చరల్ అసోసియేషన్ ప్రోగ్రాం ఈరోజుతో పూర్తయింది.

దాదాపుగా ఈవేసవిలో ఇరవైరోజులపాటు మంచి కార్యక్రమం నిర్వహించారు. అన్నిరోజులూ ఒకరితో ఒకరం తమ తమ భావాలను పంచుకున్నాం.

ఆమెను చూస్తుంటే ఎందుకో తెలియని అభిమానం కలుగుతుంది. ఆమె ఒడిలో తల నుంచి మాతృస్పర్శను అనుభవించాలని ఉద్వేగం కలుగుతుంది. నాకున్న ఇవే భావనలు ఆమెక్కూడా ఉన్నాయేమో అనిపించేటట్లుంది ఆమె ప్రవర్తన.

★ ★ ★

ఆ మరుసటి రోజు మా ఇంట్లో భోజనం. ఇన్నిరోజుల్లో ఆమె చాలాసార్లు మా ఇంటికి వచ్చారు. నా శ్రీమతి అసూయాద్వేషాలకు అతీతంగా ఉంటుంది వైదేహి. భోజనం పూర్తికాగానే కాస్తంత విశ్రాంతి తీసుకున్నారు. పెట్టిన పట్టుచీరను మొహమాటం లేకుండానే తీసుకున్నారు.

"మిస్టర్ రాం! మన పరిచయానికి, మన చెలిమికి గుర్తుగా తీసుకుంటున్నాను దీన్ని. ప్రతి ఫంక్షన్‌కీ ఈ చీరని కట్టుకుంటాను సుమా!" అన్నారు సంతోషంగా.

"ఉత్తరాలు రాస్తుండండి"అన్నారు.

"అలాగే" అన్నాం మేమిద్దరం ఆనందంగా.

చిరునవ్వులే ప్రతి సమాధానంగా ఇచ్చాం. చెంగుచెంగున చెంగనాలు తీసే లేగదూడలా మా ఇంటిలో ఉన్నంతసేపూ హుషారుగా ఉన్నారు. ఐదుగంటల ట్రైంలో మా ఇంటినుంచి కదిలారామె.

రైల్లో కూర్చున్నారావిడ. ఆమెతో మాట్లాడాలని ఉంది. నిశ్శబ్దాన్ని ఆమె ఛేధించారు.

"మనభావాలను గౌరవించి, మన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకునే వ్యక్తులు జీవితభాగస్వామిగా లభించడం మన సుకృతం. మిస్టర్‌రాం! నా భావాలను, అభిప్రాయాలను ఈలేఖలో ఉంచాను. చదవండి" అంటూ అప్పటికే హ్యాండ్‌బ్యాగ్‌లో నుండి తీసి పెట్టుకున్న కవర్‌ని నా చేతిలో ఉంచారు. రైల్ కదిలింది. ఆ రాత్రి ప్రశాంతంగా ఉన్న ట్రైంలో వరలక్ష్మిగారిచ్చిన ఆ కవర్‌ను విప్పి చదవడం ప్రారంభించాను. అక్షరాల వెంట కళ్ళు ఆనందంతో పరుగులు తీశాయ్.

★ ★ ★

**ఓ నేస్తం!**

నా ఈ నలభైఏళ్ల జీవితంలో నాకంటూ సరైన మిత్రులు లేరు. నేను చాలా మితభాషిని. జీవితంలోకి అతి పిన్నవయసులోనే ఆర్థికంగా అంతస్తును సాధించిన రావుగారు నన్ను ఏరికోరి చేసుకున్నారు. కానీ మిమ్మల్ని చూశాక నా మనసు ఎందుకో కదిలింది. నా గుండెల్లో ఒకరకమైన అభిమానం. మీచేత లాలింపబడాలని, ఒక సోదరిలా ఆదరించాలని, ఒక స్నేహితురాలిలా అభిమానించాలని అనిపించింది. మిమ్మల్ని చూస్తే నాలో నాకే తెలియని ఉద్వేగం, ఉత్సాహం. మీకులాగే నాకూ జీవితంలో ఎలాంటి అసంతృప్తిలేదు. స్నేహపూరితమైన మీ మనసు నా మనసును తట్టిలేపింది. ఈ చెలిమిని ఇలా ఇలా ఈశ్వాస ఆగేంతవరకూ ఒక అలలా, బంగారుకలలా, పదిలంగా, పదింతలై కలకాలం కొనసాగాలని ఆశతో...

మీ నేస్తం
వరలక్ష్మి"

★ ★ ★

ఇంటి ముందున్న బోగన్‌విల్లా చెట్టు క్రింద వెన్నెలని ఆస్వాదిస్తూ ఈ ఉత్తరాన్ని చాలాసార్లు చదివి ఉంటాను. నేను తనకు రాసిన లేఖలో అవే భావాలు, అవే అక్షరాలు. నాకెంతో సంతోషంగా ఉంది. ఆమెతో పరిచయం నాకు ఓ మలయపవనం లాంటిది. 'భావస్థిరాణి జననాంతర సౌహృదాని' అన్న కాళిదాసు వాక్యం జ్ఞప్తికి వచ్చింది. ఏ జన్మలోని అనుబంధమో ఈ జన్మలో స్నేహంగా మారుతుంది. ఈ జన్మలో ఒకరిని చూస్తే కోపం, మరొకరిని చూస్తే గౌరవం, ఇంకొకరిని చూస్తే అకారణమైన విద్వేషం, వేరొకరిని చూస్తే మితిమీరిన ప్రేమ కలగడానికి కారణం పూర్వజన్మ సువాసనలే అనే మాట నిజం అనిపించింది.

అందుకే మహాకవి కాళిదాసుకి నమస్కారాలు పెట్టి ఉత్తరాన్ని మడిచి ఇంటిలోనికి నడిచాను. ఏదో ఒక ఆనందం నన్ను తట్టిలేపి పరవశింపచేసిందని తేలికైన నా మనస్సు చెబుతూనే ఉంది. కాళిదాసు శ్లోకాన్ని మననం చేసుకుంటూ నా రీడింగ్‌రూమ్‌లోనికి ప్రవేశించాను.

★

## డాక్టర్ ఘనత

ఎంతోమంది మహామహులు భవిష్యత్తులో మానవాళికి మంచి జరగాలని తమ ప్రాణాలను పణంగా పెట్టినవారు ఉన్నారు. అటువంటి వారిలో డా.జె.సి.విలియమ్ ఒకరు. మహమ్మారిగా వ్యాపించిన ఎల్లోఫీవర్‌కు మందు కనిపెట్టాలనే ఉద్దేశ్యంతో ఆ జ్వరానికి మూలకారణమైన దోమచేత కాటు వేయించుకుని ఆ జ్వరంతోనే తగిన మందును పరిశోధన చేస్తూ ఆ ప్రయత్నంలో ప్రాణాలు బలి ఇచ్చిన త్యాగధనుడు. ఆయన త్యాగంవల్లనే మానవాళికి ఊరటనిచ్చే ఎల్లోఫీవర్ మందు తయారైంది.

## టెలిగ్రాఫ్

ఈరోజుల్లో ప్రజానీకానికి ఇంటర్‌నెట్, ఈమెయిల్, ఫ్యాక్స్, సెల్యులర్ ఫోన్స్, కార్డ్‌లెస్ ఫోన్లు అందుబాటులో వున్నాయి. టెలిఫోన్, టెలిగ్రాఫ్, పోస్టులాంటివి ఇప్పుడు ఉన్నా వాటి ప్రాధాన్యత ఇంతకుముందులా లేదు. పూర్వం ఒక చోటు నుండి మరోచోటుకి వెళ్లాలంటే డప్పులు, బ్యాండుమేళాలు వాయించుకుంటూ శబ్దం చేసుకుంటూ వెళ్లేవారు. ఈ కోడ్ భాష ఇతరులు అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేది. ఆఫ్రికాలోని ఒక తెగవారు ఇలాంటి శబ్దాల ద్వారా మూడు నుంచి నాలుగు మైళ్ళు వార్తలను చేరవేసేవారు.

-పి.వి.ఆర్

